# పత్రికా ప్రకటన 18-09-2018

బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీమతి ఆకుల విజయ అధ్యక్షతన మహిళా మోర్చా సమావేశం నేడు బిజెపి రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మన్ మాట్లాడుతూ ఈ నెల 27న మహిళా సమ్మేళనాన్ని భారీ ఎత్తున నిర్వహించాలని బిజెపి నిర్ణయించిందని, ఈ సమ్మేళనానికి మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనేలా మహిళా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ మహిళా సమ్మేళనానికి కేంద్రమంత్రి శ్రీమతి స్మృతి ఇరానీ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రంలో మహిళా సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాలను మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరముందన్నారు. మహిళా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇల్లు పిచ్చుక గూళ్ళు... డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టిస్తామని చెప్పి ఇప్పటివరకు నామమాత్రంగా కొన్ని ఇళ్లు కట్టి పేద ప్రజలను నిండా మోసం చేశారని విరుచుకుపడ్డారు. ఇందిరమ్మ ఇళ్లలో భారీ అవినీతి జరిగిందన్న సీఎం కేసీఆర్... డబుల్ బెడ్ రూమ్ సంగతేమో కానీ కనీసం ఉన్న ఇల్లు లేకుండా చేశారని దుయ్యబట్టారు. ప్రధానమంత్రి అవాస్ యోజన కింద రాష్ట్రంలోని గ్రామాలకు, పట్టణాలకు కేంద్ర ప్రభుత్వం దాదాపు రెండు లక్షలకు పైగా ఇళ్లు మంజూరు చేసినా... టీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఆ ఇళ్లను కట్టివ్వలేకపోయిందని విమర్శించారు. ప్రతి కుటుంబానికి సొంతిల్లు ఉండాలన్న సంకల్పంతోప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేదల గృహనిర్మాణానికి ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఇళ్లు కేటాయించి నిధులు మంజూరు చేసినా... రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ఆ లక్ష్యం నెరవేరకుండాపోయిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రెండు లక్షల ఇళ్లు పేదలకు ఇచ్చినట్లయితే కొంతవరకు ఇళ్ల సమస్య తీరేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇందిరమ్మ ఇళ్లలో అవినీతి జరిగిందన్న రాష్ట్ర ప్రభుత్వం అవినీతిని బయట పెట్టలేకపోయింది. అవినీతిపై నివేదిక ఉన్నా ఎందుకు బయటపెట్టలేక పోయారో ఇప్పటివరకు చెప్పలేదని మండిపడ్డారు. అవినీతి విషయంలో కాంగ్రెస్ తో టిఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం చేసుకుందన్న విషయం బహిరంగ రహస్యం అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ అవినీతిని బయట పట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ డూప్ ఫైటింగ్ చేస్తూ టిఆర్ఎస్ అవినీతిపై, కుటుంబ పాలనపై ప్రశ్నించలేక పోతుందన్నారు.

కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో మహిళల భాగస్వామ్యం లేకుండా మంత్రివర్గం ఏర్పాటు చేయడం మహిళాశక్తిని అవమానపరచడమే అవుతుందన్నారు. మహిళలు అంతరిక్ష యాత్రలు చేస్తున్న ఈ రోజుల్లో తెలంగాణలో మహిళా మంత్రి లేకపోవడం దురదృష్టకరమని అభివర్ణించారు. రాష్ట్రానికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వంలో ప్రధాని నరేంద్రమోదీ కీలకమైన విదేశాంగ, రక్షణ తదితర మంత్రిత్వ శాఖల్లో మహిళలను నియమించారని తెలిపారు. లోక్ సభ స్పీకర్ గా మహిళను నియమించిన ఘనత బిజెపిదని వెల్లడించారు.

నేడు మహిళలు అంతరిక్షం లోకి వెళ్తున్నారు, యుద్ధ విమానాలను నడుపుతున్నారు, కానీ ముఖ్యమంత్రి మాత్రం మహిళలు బోనాలెత్తేందుకు, బతుకమ్మ ఆడడానికే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అనేక కార్యక్రమాలను చేపడుతుందని, మహిళా ఉద్యోగులకు 26 వారాల ప్రసూతి సెలవులు, బాలికా సంరక్షణ కోసం బేటీ బచావో బేటీ పడావో, సుకన్య సమృద్ధి యోజన లాంటి అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, ఈ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. మహిళా సాధికారత కోసం గతంలో ఎన్డీఏ ప్రభుత్వం మహిళ సంఘాలకు ఇతోధికంగా ఆర్థిక సహాయాన్ని అందజేసిందన్నారు.

ఇటీవల జరిగిన ఓ ప్రవేశ పరీక్షలో మహిళల మంగళ సూత్రాలను పక్కనపెట్టి పరీక్ష రాయాలని నిబంధన లేకపోయినా... మహిళల మెడలో నుంచి మంగళ సూత్రాలను తీసివేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ మతంలో మంగళసూత్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, గతంలో కూడా అనేక సార్లు ఇదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. మంగళ సూత్రాన్ని తీయడం ఇష్టంలేని మహిళలు పరీక్ష రాయని సంఘటనలు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ అదే తప్పు చేయడం అహంకారానికి నిదర్శనమని నిప్పులు చెరిగారు. పుస్తెలు, మెట్టెలు, గాజులు తీయడం మన సంస్కృతికి సంప్రదాయాలకు విరుద్ధమైన ఇలాంటి సంఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించకపోవడం దారుణమన్నారు. హిందూ సాంప్రదాయాలతో, మహిళలతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం మనజాలదని, ఈ ప్రభుత్వానికి మహిళలు తగిన గుణపాఠం చెప్తారని స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్యంలో నిరసన చెప్పే హక్కు ప్రజా సంఘాలకు, రాజకీయ పార్టీలకు ఉందని, ఈ ప్రభుత్వానికి కోర్టులో ఎన్ని మొట్టికాయలు వేసిన తన నైజాన్ని మార్చుకోలేదని అన్నారు. నిరసన హక్కు ఉందని హైకోర్టు చెప్పడం

తెలంగాణ ప్రజల విజయంగా భావిస్తున్నామన్నారు. ధర్నా చౌక్ వద్ద ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకున్నా, సమస్యను చూపించడం సరైంది కాదని అన్నారు.

మహిళలు కూడా ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని ఎంతో ఆసక్తితో ఉన్నారని, బిజెపి వారికి తగిన ప్రాధాన్యత ఇస్తామన్నారు. బిజెపిలో మహిళలకు తగిన గుర్తింపు ఉందని, మండల స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు బిజెపిలో ప్రధానమైన కమిటీలలో 33 శాతాన్ని అమలు చేస్తున్న పార్టీ బిజెపి మాత్రమే అని స్పష్టం చేశారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజాబలంతో బిజెపి రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు.